రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

- నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కృష్ణదేవరావు



సమావేశంలో మాట్లాడుతున్న నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కృష్ణదేవరావు

దేవరుప్పుల, జనవరి 23: రాజ్యాంగంపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నల్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కృష్ణదేవరావు అన్నారు. దేవరుప్పుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై భారత రాజ్యాంగం అనే అంశంపై విస్తరణ ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహనతో పాటు నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఏమాత్రం తప్పిదాలు చేసినా జీవితం వ్యర్థం అవుతుందని తెలిపారు. ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. విద్యార్థులు న్యాయశాస్త్రం అభ్యసించే దిశగా ప్రయత్నించిన వారికి తన సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. అనంతరం ప్రొఫెసర్ కృష్ణదేవరావును పాఠశాల ప్రిన్సిపాల్ రాపోలు ప్రభాకర్‌తో పాటు అధ్యాపకులు రాధిక, చైతన్య, హరిత కుమారి. శశిధర్, రహిమున్నీసా, రవీందర్, భవానీ, ఉదయ్‌కుమార్, మహేష్, శ్రీనివాస్, ఆదర్శ, వెంకన్న పాల్గొన్నారు.

- » జిల్లాలోని 502 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు
- » పాఠశాలల్లో ఎన్నికల సందడి
- » 1-8 తరగతుల విద్యార్థుల పేరెంట్స్‌కు పోటీ అవకాశం
- » నేడు తల్లిదండ్రుల తుది జాబితా ప్రకటన
- » 29న విద్యా కమిటీ ఎన్నికలు
- » ఇదే రోజున కొలువుదీరనున్న కొత్త కమిటీలు
- » ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు
- » నాలుగేళ్ల తరువాత ఎన్నికలకు మోక్షం



యాజమాన్య కమిటీలు
ప్రగతికి వెలుగులు

బడుల్లో మోగిన ఎన్నికల నగారా

జఫర్‌గఢ్, జనవరి 23 : బడుల అభివృద్ధికి దోహద పడే పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణకు నగారా మోగింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఇటీవల షెడ్యూల్‌ను ప్రకటించగా, ఈ నెల 20న విద్యాశాఖ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తద్వారా ఈ నెల 29న జిల్లాలోని ఆయా పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ కమిటీల పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన, అభివృద్ధితో పాటు విద్యార్థుల చదువును మెరుగుపరచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ప్రకారం 2009 నుంచి పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేసింది. 1 నుంచి 8 తరగతులు చదివే పిల్లల తల్లిదండ్రులచే వీటికి ప్రతి రెండేళ్లకోసారి 2019 వరకు ఎన్నికలను నిర్వహిస్తూ వచ్చారు. 2021లో కమిటీల పదవీకాలం ముగిసినా.. కరోనా కారణంగా ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలను వాయిదా వేసింది. ప్రతి ఆరు నెలలకోసారి 2023, డిసెంబరు 31 వరకు వాయిదా వేస్తూ వచ్చారు. ఆ గడువు కూడా ముగిసిపోవడంతో వాయిదాలకు బ్రేక్ వేస్తూ ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సమగ్ర శిక్షా, విద్యాశాఖ అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలపై ఈనెల 19న కలెక్టరేట్‌లో నోడల్ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని ప్రభుత్వ, గురుకులాలు, ఆదర్శ, కస్తూర్బా విద్యాలయాలు, ప్రభుత్వ అనుబంధ పాఠశాలలతో కలిపి మొత్తం 502 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించనున్నారు.

నేడు తుది జాబితా .. 29న ఎన్నిక...

ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభమైంది. 1-8 తరగతుల వారీగా సంబంధించిన విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లతో జాబితాలను ఆయా పాఠశాలల్లో విడుదల చేశారు. 22 నుంచి 23 వరకు జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిశీలన అనంతరం.. ఈ నెల 24న తల్లిదండ్రుల తుది జాబితాను పాఠశాలల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తారు. 29వ తేదీ సోమవారం రోజున పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నిక నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నూతన ఎస్ఎంసీలచే ఆయా పాఠశాలల్లో తొలి సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో పాఠశా లల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి వంటి అంశాలపై చర్చించనున్నారు.

ఎన్నిక విధానం..

జిల్లాలోని ప్రభుత్వ, గురుకుల, ఆదర్శ, కస్తూర్బా, గురుకుల విద్యాలయాలు, యుఆర్ఎస్, ఆశ్రమ, ఎయిడెడ్, అనుబంధ పాఠశాలల యాజమాన్య కమిటీలకు నిబంధనల ప్రకారం ఈ నెల 29న ఎన్నిక నిర్వహిస్తారు. 1 -5 తరగతుల ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతిలో ముగ్గురు చొప్పున 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులో 10 మంది మహిళలకు రిజర్వు చేశారు. 1 -7 తరగ తుల ప్రాథమికోన్నత పాఠశాలల్లో 21 మంది సభ్యుల్లో, 14 మంది మహిళలకు రిజర్వు చేయగా, 6 -8 తరగతుల జడ్పీ, ఉన్నత పాఠశాలల్లో 9 మంది సభ్యుల్లో.. ఆరుగురు మహిళలు, అలాగే 1- 8 తరగతులు గల ఉన్నత పాఠశాలల్లో 24 మంది సభ్యుల్లో.. రిజర్వేషన్ ప్రకారం 16 మంది మహిళలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎన్నికైన సభ్యులంతా కలిసి వారిలో నుంచి ఒకరిని విద్యా కమిటీ చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. వీరితో పాటు ఒక్కో కమిటీలో ఆరుగురు ఎక్స్ అఫిషియో, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులు ఉంటారు. ఈ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (ఎక్స్ అఫీషియో సభ్యుడు)వ్యవహరిస్తారు. ఈ కమిటీల పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. ఈ ఎన్నిక సమావేశా నికి ఓటర్లలో(తల్లిదండ్రులు) 50 శాతం మంది హాజ రు కావాల్సి ఉంటుంది. చేతులెత్తే పద్ధతిలో సభ్యులు ఎస్ఎంసీ కమిటీని ఎన్నుకుంటారు. పాఠశాల సక్రమ నిర్వహణ, మౌళిక వసతుల కల్పన, విద్యార్థుల చదువుతో పాటు పాఠశాలకు మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించేలా చూడడంలో ఎస్ఎంసీల పాత్ర కీలకమైంది.



ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టాం...

- బి.నర్సింహరావు, విద్యాశాఖ జిల్లా సమన్వయ అధికారి, జనగామ

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు తగు ఏర్పాట్లు చేపట్టాం. షెడ్యూల్‌ను ఆయా పాఠశాలల హెచ్ఎంలు క్షుణ్ణంగా చదివి ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలి. ఎలాంటి పొరపాట్లకు తావీయకూడదు. జిల్లాలోని ప్రభుత్వ అనుబంధ పాఠశాలలతో కలిపి మొత్తం 502 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించబోతున్నాం. 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీలను ఏర్పాటు చేస్తాం. ఈ నెల 29న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఆయా పాఠశాలల్లో కొత్తగా ఎన్నికైన ఎస్ఎంసీ కమిటీలతో సమావేశాలు నిర్వహిస్తారు. ఎన్నికల సక్రమ నిర్వహణకు అందరూ సహకరించాలి.

పుస్తక పఠనంతో
జీవన శైలిలో మార్పు

- అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్



ఎడవెల్లి కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ కల్చరల్, జనవరి 23: పుస్తక పఠనంతో మనిషి జీవితంలో ఉన్నతమైన మార్పు వస్తుందని అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాయల సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి పదవీ విరమణ సభ గ్రంథాలయ కార్యదర్శి సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు అడిషనల్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ రోజు గ్రంథాలయాలకు వెళ్తే మంచి మిత్రులు దొరుకుతారన్నారు. నేటి యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఎడవెల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరేళ్ల పాటు గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పనిచేసి మౌలిక వసతులు కల్పించానన్నారు. అనేక గ్రామాల్లో మినీ లైబ్రరీలు ఏర్పాటు చేశానన్నారు. అనంతరం కృష్ణారెడ్డిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండ పద్మయాదగిరిరెడ్డి, న్యాయవాదులు కర్ర ఎల్లారెడ్డి, వజ్జులు, జరసం కన్వీనర్ పెట్లోజు సోమేశ్వర చారి, లైబ్రేరియన్ రాంచందర్‌నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుగులు వెంకన్నకు సువర్ణ పుష్పార్చన



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఈవో భాగం లక్ష్మీప్రసన్న

చిలుపూర్, జనవరి 23 : చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయంలో సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ స్వామి వారి పాదాలను 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలో పాల్గొ న్న భక్తులకు ఆశీర్వచనంతో పాటు, స్వామి వారి శేష వస్త్రాలను అందజేశారు. ఈ సం దర్భంగా ఈవో భాగం లక్ష్మీప్రసన్న టికెట్‌ను కొనుగోలు చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, నంగోజు మోహనాచారి, పూజారులు రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది ఆడెపు రమేష్, వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్ పాల్గొన్నారు.

మహాజాతర పనుల్లో అలసత్వం వద్దు

- » జాప్యం చేస్తే చర్యలు తప్పవు
- » అధికారులపై గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ ఫైర్
- » మేడారంలో పలు శాఖల పనితీరుపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

మేడారం, జనవరి 23 : మహాజాతర పనుల్లో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్ అన్నారు. ఆయా పనుల్లో జాప్యమవుతోందని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఐటీడీఏ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడారంలో ఆయన గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఇ.వెంకటనర్సింహారెడ్డి, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మంగళవారం పర్యటించారు. వనదేవతల మహాజాతర జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు.

మేడారంలోని సమ్మక్క భవనంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని జాతర శాశ్వత, తాత్కాలిక పనుల పురోగతిపై సమీక్షించారు. పనుల్లో జాప్యం జరుగుతోందని, వేగవంతం చేసి ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతరకు ముందస్తుగా మేడారానికి వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సైన్ బోర్డులు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్కింగ్ స్థలంలో ఎన్ని వాహనాలను పార్కింగ్ చేయొచ్చో తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మేడారం దుకాణాలు, స్టాల్స్ వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అన్నారు. ముందస్తుగా వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జంపన్నవాగులో లోతట్టు ప్రాతాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా ఇసుక లెవలింగ్ పనులను పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. జాతర పరిసరాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. గత జాతరల్లో చోటుచేసుకున్న సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు నిరంతరం వైద్య సేవలు అందించాలన్నారు. అత్యవసర వైద్యం కోసం వీలైనంత ఎక్కువ సంఖ్యలో మినీ అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలన్నారు. భక్తుల సౌకర్యాల కల్పనలో రాజీపడొద్దని, అన్ని పనులూ నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పేలా మేడారం మహాజాతరను ఘనంగా నిర్వహించాలన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు మధుర జ్ఞాపకాలు గుర్తుండిపోయేలా పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టాలన్నారు.



జంపన్నవాగును పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

గిరిజన సంక్షేమ శాఖ డైరక్టర్ వెంకటనర్సింహరెడ్డి మాట్లాడుతూ మహాజాతరను విజయవంతం చేయడానికి ఎవరికి కేటాయించిన పనులను వారు సమర్థంగా చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పోలీసు శాఖతో సమన్వయంగా బందోబస్తు వ్యవస్థను పటిష్టంగా చేపట్టాలన్నారు. ఆయా శాఖల అధికారులు టీమ్‌వర్క్ చేసి జాతరను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ములుగు ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఓఎస్డీ అశోక్‌కుమార్, పలు శాఖల అధికారులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

జనగామ టౌన్, జనవరి 23: జనవరి 26 గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పనిచేసి గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జాతీయ పతాకావిష్కరణలో జిల్లా అధికారులతో పాటు సంబంధిత శాఖల సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో వేడుకలు నిర్వహించనున్నామని, పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రముఖులకు ఆహ్వాన పత్రాలు అందజేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీల తయారు ఏర్పాట్లను సీపీవో చూడాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రోహిత్‌సిం గ్, పర్మర్ పింకేశ్‌కుమార్, డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఈ టి.వేణుమాధవ్, కలెక్టరేట్ ఏవో రవీందర్, సీపీవో ఇస్మాయిల్, డీఈవో రాము, డీసీఎస్‌వో రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఎంఎస్‌పై అవగాహన ఉండాలి...

అధికారులు ఈఎస్ఎంఎస్‌పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శివలింగయ్య సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఢిల్లీ నుంచి మంగళవారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంసీసీ నోడల్ అధికారులు, ఐటీ, ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు, బ్యాంకర్లు, ఎస్ఎస్‌టీలు, ఎఫ్ఎస్‌టీలు తప్పనిసరిగా ఈఎస్ఎంఎస్ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. దీని వల్ల ఎలక్షన్ సమయంలో స్వాధీనం చేసుకున్న డబ్బులు ఆటోమెటిక్‌గా యాప్‌లో అప్‌డేట్ అవుతాయన్నారు. అడిషనల్ కలెక్టర్లు పర్మర్ పింకేశ్, రోహిత్‌సింగ్, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, ఏవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోవాలి..

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీలో ఓటు వేసేందుకు ప్రతీ ఒక్క గ్రాడ్యుయేట్, ఉద్యోగి ఓటరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ శివలింగయ్య సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో ఓటు వేసిన వారితో పాటు 2020కు ముందు గ్రాడ్యుయేట్ అయిన వారు ఫామ్ 18 ద్వారా ఫిబ్రవరి 6 లోపు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండలకేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల్లో ఫామ్ 18 సమర్పించవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 4700 మంది గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిష నల్ కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, ఆర్డీవోలు మురళీకృష్ణ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యస్థాపనే లక్ష్యం

ఆర్‌పీఐ రాష్ట్ర సమన్వయ కర్త జన్ను సాంబయ్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్‌పీఐ నేతలు

వడ్డేపల్లి, జనవరి 23: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను సంఘటిత పరిచి బహుజన రాజ్యాన్ని స్థాపించడమే పార్టీ లక్ష్యమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర సమన్వయ కర్త జన్ను సాంబయ్య అన్నారు. మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పేదలందరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సొంత ఇల్లు, స్థలం లేని ప్రతీ కుటుంబానికి మూడు గుంటల స్థలం కేటాయించి ప్రభుత్వమే ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. ఆర్‌పీఐ నేత బొజ్జాతారకం సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 28న హనుమకొండలో నిర్వహించే ఆర్‌పీఐ రాష్ట్ర సదస్సులో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో సామాజిక, రాజకీయ విశ్లేషకుడు సాయిని నరేందర్, ఆర్‌పీఐ నేతలు సింగారపు అరుణ, మైదం జైపాల్, రాచకొండ ప్రవీణ్‌కుమార్, భవాని ప్రసాద్, కూనూరు రంజిత్‌గౌడ్, అన్వేష్, సాంబశివరాజు, సాగర్, రాజు, గణేష్, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, జనవరి 23: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 23, 24, 25, తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. బుధ, గురువారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
ఫోరం మాల్ - కూకట్‌పల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
గలేరియా - పంజాగుట్ట
ఐకాన్ - హైటెక్‌సిటీ
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి
అట్రియమ్ - గచ్చిబౌలి
ఎస్‌2 నోవ - మల్లాపూర్
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
ఎం.పి మాల్ - కాచిగూడ
జిఎస్ఎమ్ - మదీనగూడ
నెక్లెస్ సత్య - కవాడిగూడ
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
మంజీరామాల్ - కూకట్‌పల్లి
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
మంత్రామాల్ - అత్తాపూర్
సుధా - శాలిబండ
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
మిరాజ్ సినిమాస్ - బాలానగర్
మిరాజ్ సినిమాస్ - చందానగర్
లక్ష్మీనరసింహ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షా షహెన్‌షా - చింతల్
లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్

నకిలీ 'పోచంపల్లి'!

పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు

భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు

200 ప్రింటింగ్ చీరలు సీజ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకే ఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరికొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్‌ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్‌ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ తరఫున 19 మంది, బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్‌ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్‌ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాల్టీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఆందోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాల్టీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాల్టీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాల్టీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాల్టీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే 'అసెంబ్లీ సమీక్షలు'

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్

పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్‌ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తర ఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకో ర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్టు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరోవైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి

తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు

తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జిడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలి

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ● పాలకుర్తి, కొండకండ్ల మండలాల్లో సర్వసభ్య సమావేశాలు ● తొర్రూరులో పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పాలకుర్తి, జనవరి 23 : ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి నిరుపేదల వద్ద ఎవరైనా డబ్బులు తీసుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరై మాట్లాడారు. నిలువ నీడలేని నిరుపేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కొంత మంది అక్రమంగా చొరబడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను ఆదేశించానని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల నుంచి చేయని పనులు రెండు నెలల్లో ఎలా చేస్తామని అన్నారు. ఇటీవల వరంగల్‌లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనుల తీరు చర్చకు వచ్చాయని, పదేళ్ల నుంచి కానీ రిజర్వాయరుల పనులను ఐదేళ్ల కాలంలో పూర్తి చేసి చూపిస్తామన్నారు. గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడదను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. సర్పంచులు అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తే బిల్లులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని ఆమె అన్నారు. వారికి న్యాయం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, ప్రభుత్వ పాఠశాలలను కూడా తనిఖీలు చేస్తామని పేర్కొన్నారు. మండల సభకు ఎంపీపీ నాగిరెడ్డి, జడ్పీటీసీ శ్రీనివాసరావు, తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీవో అశోక్‌కుమార్, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు మదార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● కొడకండ్ల : పార్టీలతో సంబంధం లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్వినీ రెడ్డి తెలిపారు. కొడకండ్ల మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆమె సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బీఆర్ఎస్‌కు చెందిన ప్రజా ప్రతినిధులే అధికారులను నిలదీశారు. యశస్వినీ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొట్టమొదటిసారి అధికారికంగా కొడకండ్ల రావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమను తాము పరిచయం చేసుకుని శాలువాతో సత్కరించారు. పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాల్సిందిగా, మధ్యలో ఉన్న అభివృద్ధి పనులను కొనసాగించాల్సిందిగా ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె టీఎస్ఆర్ఎస్ పాఠశాలకు వెళ్ళి అన్ని సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ అందెయాకయ్య, ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి , ఎంఆర్వో అంజయ్య, వైస్ ఎంపీపీ వీరసోములు, సూపరింటెండెంట్ ఇందిర, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి

తొర్రూరులో పాలకవర్గ సమావేశం

తొర్రూరు : మునిసిపాలిటీల పరిధిలో ప్రజల అవసరాల మేరకు ప్రణాళికా ప్రకారం అవసరమైన పనులను చేపట్టాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరులో నిర్వహించిన పాలకవర్గ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మునిసిపాలిటీ పరిధిలో చేపడుతున్న పనులను ముందస్తు అవసరాల మేరకు ప్రణాళికంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను కూడా మంజూరు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కాగా పట్టణంలో పలు సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని మునిసిపల్ కౌన్సిలర్లు ఎమ్మెల్యేని కోరారు.

వార్డు కమిటీల్లో సమతుల్యత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ టౌన్, జనవరి 23: కాంగ్రెస్ వార్డు కమిటీల్లో సమతుల్యత పాటించాలని సమన్వయకర్తలకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బుధవారం నుంచి పట్టణంలో రోజుకు మూడువార్డుల చొప్పున పార్టీ కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వాలని పరిశీలకులకు సూచించారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి రాబోయే ఎన్నికలకు సిద్ధం చేయాలని సమన్వయ కమిటీలకు చెప్పారు. పాఠశాల యాజమాన్య కమిటీలు కూడా పూర్తి చేసి విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చెంచారపు బుచ్చిరెడ్డి, ఇందిరా కృష్ణస్వామి, బనుక శివరాజ్‌యాదవ్, మేడ శ్రీనివాస్, ఆలేటి సిద్ధిరాములు, పిట్టల సతీశ్, మల్లేశ్, రాంచందర్, అనితవేణుమాధవ్, కరుణాకర్‌రెడ్డి, బొట్ల నర్సింగరావు పాల్గొన్నారు.

బచ్చన్నపేట దుర్గామాత హుండీ లెక్కింపు

బచ్చన్నపేట, జనవరి 23: బచ్చన్నపేట దుఆర్గమాత హుండీ లెక్కింపు మంగళవారం సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి నేతృత్వంలో లెక్కించారు. రూ. 70 వేల ఆదాయం వచ్చినట్టు తెలిపారు. కాగా ఆలయ అభివృద్ధి పనుల కోసం ఈ డబ్బులు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. ఆలయం స్లాబ్ పనుల కోసం ఇసుక, సిమెంట్‌కు అయ్యే ఖర్చును తాను భరించనున్నట్టు సర్పంచ్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బోడకుంటి మల్లయ్య, కోడూరు మహాత్మాచారి, దిడిగ రమేశ్, తమ్ముడి మహేందర్ తదితరులున్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో లాభాలు

వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న

రఘునాథపల్లి, జనవరి 23: అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులు అధిక దిగుబడితో పాటు అత్యధిక లాభాలు పొందడం సాధ్యమవుతుందని, దీంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన పత్తి పంటకు సంబంధించిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, యాదాద్రి భువనగిరి జిల్లా ఏరువాక కేంద్రం వారు సంయుక్తంగా మండలంలోని నిడిగొండ గ్రామంలో వ్యవసాయ అధికారులతో పాటు వ్యవసాయ విస్తరణాధికారులకు ' పత్తి పంటలో సమగ్ర యాజమాన్యం' అనే అంశంపై మంగళవారం ఒక రోజు వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పత్తి పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్నతో పాటు జిల్లా వ్యవసాయాధికారి వి.వినోద్ కుమార్ మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగుతో అధిక లాభాలు సాధించడం సాధ్యమవుతుందని, నూతన సాంకేతిక వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరవేయడంలో వ్యవసాయ శాఖకు చెందిన ఏవోలతో పాటు ఏఈవోలు ముఖ్య భూమిక పోషించాల్సిన అవసరం ఉందన్నారు. అధిక సాంద్రత పత్తి సాగులో గల అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు వివరించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.అనిల్ కుమార్, డాక్టర్ ఓంప్రకాష్, ఏవో కె.శ్రీనివాస రెడ్డి,ఏఈవోలు కరుణాకర్, వినోద్, కల్పన తదితరులు పాల్గొన్నారు.



నిడిగొండలో జరిగిన పత్తి పంట సమగ్ర యాజమాన్యం వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న

సెయింట్ మేరీస్ లో చేతిరాత దినోత్సవం



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ జైమోన్ థామస్

జనగామ కల్చరల్, జనవరి 23: జాతీయ చేతివ్రాత దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాల లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ జైమోన్ థామస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అక్షర చేతివ్రాత సెంటర్ చేతివ్రాత నిపుణులు మిరాజ్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన చేతివ్రాత పోటీలలో పాఠశాల కు చెందిన 9 మంది ఉత్తమ ప్రతిభ కనబరచగా వారికి ప్రశంసాపత్రాలు అంద జేశారు. ఇందులో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని స్వీకృతి కర్సివ్ రైటింగ్‌లో రాష్ట్రంలో రెండో స్థానం దక్కించుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సంపత్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అండ

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ కడియం శ్రీహరి



సంపత్‌రెడ్డి నివాసంలో ఆయన సతీమణి సుజాతను పరామర్శిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, జనవరి 23 : బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దివంగత జిల్లా జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గత కొద్ది నెలల క్రితం గుండెపోటు కారణం గా మృతిచెందిన సంపత్‌రెడ్డి కుటుంబాన్ని మంగళవారం హనుమకొండలో పరామర్శించారు. పాగాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి సుజాత, కుమార్తె సంజనారెడ్డితో పాటు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ ఆర్థిక, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ, నాటి టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన సంపత్‌రెడ్డి 14 ఏళ్ళ పాటు రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశారని, నియమ, నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోవడం పార్టీకి తీరని లోటన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబ సభ్యులను త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దగ్గరికి తీసుకెళ్తానన్నారు. కడియం వెంట సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, ఆర్బీఎస్ మాజీ మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి, గోదల రాజిరెడ్డి, పాగాల వెంకట్‌రెడ్డి ఉన్నారు.

చిల్పూరు వేలం పాటల

ఆదాయం రూ 21.06లక్షలు

చిలుపూర్, జనవరి 23 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి దేవాలయ పరిధిలో వివిధ దుకాణ సముదాయాలు నిర్వహించుకోవడానికి మంగళవారం నిర్వహించిన వేలం పాటలకు మొత్తం రూ 21. 06 లక్షల ఆదాయం సమకూరిందని ఈవో భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. ఆలయ పరిధిలో సంవత్సర కాల పరిమితికిగాను కొబ్బరికాయలు, పూజాసామగ్రి, గండదీపం వద్ద నూనె సేకరించుకునే హక్కు కోసం వేలం పాటలు నిర్వహించగా రూ 14. 01 లక్షలు, గుట్ట దిగువన ప్రతీ ఆదివారం నిర్వహించే వార సంతలో పశువుల క్రయ విక్రయ, దుకాణ పన్నుల వసూలుకు రూ 7. 01లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ఈ సందర్భంగా ఈవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ, గతేడాది కన్నా ఈ సంవత్సరం నిర్వహించిన వేలం పాటల్లో రూ. 6. 59 లక్షల ఆదాయం అదనంగా సమకూరడం శుభపరిణామమన్నారు కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, వీరన్న, మాజీ చైర్మన్ మూల నాగరాజు, పుట్ట ఆంజనేయులు, తౌటి సునిల్, గాదె రాజశేఖర్, విశాల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం



గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్. జనవరి 23: స్వాతంత్ర్య పోరాట యోధుల్లో మేటిగా పేరు పొందిన నేతాజీ సుభాస్‌చంద్రబోస్ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని ప్రముఖ రచయిత్రి, కవయిత్రి ఎన్.రమాదేవి అన్నారు. మంగళవారం స్థానిక శివునిపల్లి పట్టణ యూపీఎస్ వద్ద ఉన్న నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు సర్పంచ్ బూర్ల విష్ణు, సామాజికవేత్త వై. ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఈఓ శ్రీకాంత్, హెచ్‌ఎం లక్ష్మీ ప్రసాద్, తిరుమల శ్రీనివాస్, కె.శరత్‌కుమార్, ఎ.నాగరాజు, సురేందర్, ఎం.మల్లేశం పాల్గొన్నారు. కాగా నేతాజీ జయంతి సందర్భంగా వి.దయాకర్, వై.ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

● రఘునాథపల్లి : ఆజాద్ హిందూ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుబాష్ చంద్రబోష్ 127వ జయంతి సందర్భంగా మండలంలోని వెల్ది గ్రామంలో మంగళవారం ఆయన చిత్రపటానికి సర్పంచ్ కొయ్యడ మల్లేష్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో యువజన క్రీడోత్సవాలు

జనగామ కల్చరల్ : వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో యువజన క్రీడోత్స వాలు నిర్వహించారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రం లో నిర్వహించిన కళాశాల స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను జనగామ సీఐ ఎలబోయిన శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రికెట్ ఆడి క్రీడాకారు లను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కెంగర్ల రాజు, గుంటుపల్లి కార్తీక్, దొంగోని వంశి, దేవులపల్లి నితీష్, పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా సమస్యలు పరిష్కరిస్తాం..

విద్యుత్ వినియోగదారుల చైర్మన్ తిరుమల్‌రావు

దేవరుప్పుల, జనవరి 23: విద్యుత్ వినియోగదారులకు పైసా ఖర్చు లేకుండా తమ సమస్యలను పరిష్కరిస్తామని (టీఎస్ ఎన్‌పీడీసీఎల్)సీజీఆర్ఎఫ్-1 చైర్మన్ (ఎఫ్‌ఏసీ) కె.తిరుమల్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని సింగరాజుపల్లిలో మండల విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక(లోకల్ కోర్టు)కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో దూసుకుపోతున్న సాంకేతికరంగంలోని వాట్సాప్, ఈ మెయిల్, ఆన్‌లైన్ ద్వారా కూడా విద్యుత్ సమస్యలపై (రిజిస్టర్)ఫిర్యాదు చేయవచ్చని, వాటి ద్వారా కూడా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా మొబైల్ ఫోన్‌లేని వారు, స్మార్ట్ ఫోన్ లేని వారు కూడా తెల్లకాగితంపై సమస్యల దరఖాస్తు చేసుకుని రిజిస్టర్ పోస్ట్ ద్వారా కూడా పంపవచ్చన్నారు. అంతేకాకుండా తమ విద్యుత్ అధికారులకు సబ్‌స్టేషన్లలోని కార్యాలయాల్లో తెలిపినప్పటికీ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మంగళవారం సింగరాజుపల్లిలో 13విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు రాగా మూడు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఫైనాన్స్ మెంబర్ చంద్రదాస్, టెక్నికల్ మెంబర్ నరేందర్, ఏడీఈ అనిల్, సీఎస్ వేణు, ఏఈలు సుధాకర్, రాజవర్ధన్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న, తిరుమల్‌రావు

కుక్కల దాడిలో లేగదూడ మృతి

బచ్చన్నపేట, జనవరి 23: కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని కొన్నె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పిట్టల కేశవులుకు చెందిన లేగదూడపై కుక్కల గుంపు విరుచుకుపడి కొరికి వేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ. 15 వేలు ఉంటుందన్నారు. కాగా గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ బయటకు వస్తున్నట్టు తెలిపారు. గతంలో పెద్ద సంఖ్యలో కుక్కలదాడిలో మేక పిల్లలు చనిపోయినట్టు గుర్తుచేశారు. జీపీ ప్రత్యేక చర్యల ద్వారా కుక్కల బెడద లేకుండా చూడాలని కోరుతున్నారు.

జీపీ డెవలప్‌మెంట్ ప్రణాళికపై సమావేశం

బచ్చన్నపేట, జనవరి 23: గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రణాళికపై మంగళవారం మండలంలోని కొడవటూరు గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఇంకా మిగిలిన సమస్యల పరిష్కారం కోసం గ్రామ ప్రజలు సంఘటితంగా కృషి చేయాలని తెలిపారు. పేరుకుపోయిన సమస్యల వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రూపచైతన్య, వార్డు సభ్యులు, పలుశాఖల బాధ్యులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

జనగామ టౌన్, జనవరి 23: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ వ్యక్తి బావిలో పడి మృతిచెందాడు. జనగామ పట్టణ ఎస్సై అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామానికి చెందిన మారపాక పరుశరాములు(45) కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. గత నెల డిసెంబర్ 21న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ నెల 23న మంగళవారం ఉదయం ఎర్రగొల్లపహాడ్‌లోని ఓ వ్యవసాయ బావిలో పడిపోయి కనిపించాడు. మృతదేహాన్ని వెలికితీయించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

రేపు జఫర్‌గడ్ మండల సభ

జఫర్‌గడ్, జనవరి 23 : ఈ నెల 25న జఫర్‌గడ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 6న మండల సభ అర్థాంతరంగా వాయిదా పడిన విషయం విధితమే. ఎంపీపీ సుదర్శన్ అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ మండల సభలో విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, పంచాయితీ రాజ్, భూ రెవెన్యూ, సాంఘీక, మహిళా శిశు సంక్షేమం, తదితర శాఖలు, సమస్యలపై చర్చించడం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఈ మండల సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరవుతున్నారు. మండల సభకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎంపీపీతో పాటు పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు మంగళవారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియంను కలిసి ఆహ్వానించగా.. ఇందుకు ఆయన అంగీకరించినట్లు ఎంపీపీ సుదర్శన్ తెలిపారు.

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

లింగాలఘణపురం, జనవరి 23: లింగాలఘణపురం మండలం నెల్లుట్ల శివారులో మంగళవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా సుమారు 30 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం చీకటిమామిడి శివారు గోవిందు తండాకు చెందిన మేఘావత్ శంకర్ అనే వ్యక్తి మినీ ట్రక్కులో సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పాలకుర్తి మండలం గూడూరు నుంచి కొనుగోలు చేసుకుని అక్రమంగా రవాణా చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏఎస్సై అమరేందర్‌రెడ్డి నెల్లుట్ల వద్ద పట్టుకున్నారు. బియ్యంతో పాటుగా వాహనం సీజ్ చేసి నిందితుడిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్త మృతికి 'పల్లా 'సంతాపం

జనగామ టౌన్, జనవరి 23: జనగామ పట్టణంలోని 30వ వార్డులో బీఆర్ఎస్ కార్యకర్త సోమారపు ఉపేందర్(32) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బొట్ల శ్రీనివాస్ ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

జనగామ కల్చరల్, జనవరి 23: పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రం లోని జిల్లా ట్రెజరరీ కార్యాలయంలో ఆ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు రావలసిన మూడు డీఆర్ లను వెంటనే విడుదల చేయాలని, గతంలో రూ.398 వేతనంలో పని చేసి రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, ప్రతి జిల్లాలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, ఐఆర్ ను 20% పెంచాలని, పీఆర్‌సీ ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శంకరయ్య, ఇప్ప రాంరెడ్డి, డి.ధర్మయ్య, కె.అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత

జఫర్‌గడ్, జనవరి 23 : మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు.. 1997-98 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు క్రీడా దుస్తులను బహూకరించారు. హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న 90 మంది బాల బాలికలకు రూ.30 వేల విలువ గల క్రీడా టీ షర్టులు, ట్రాక్ ప్యాంట్లను మంగళవారం హెచ్‌ఎం ఎండి.పర్వేజ్ చేతుల మీదుగా పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు అందించారు. త్వరలోనే పాఠశాలకు 25 కుర్చీలను బహూకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పోతోజు ఎల్లాచారి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేశ్‌బాబు, చంద్రమోహన్, రవి, గిరిజ, స్వరూపారాణి, రాజేందర్, వేణుగోపాల్, విజయశ్రీ, సిరాజ్, కరుణశ్రీ, శంకర్, ఉమ, యాదగిరి పాల్గొన్నారు.

సేఫ్టీ మోకులు అందించాలి

పాలకుర్తి, జనవరి 23 : గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించి ప్రాణాలను కాపాడాలని మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డికి గీత కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సం దర్భంగా కల్లు గీత కార్మిక సంఘం జనగామ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర ఉప్పలయ్య, బాల్నే వెంకటమల్లయ్య కమ్మగాని రమేష్, నాగన్న, మహేందర్, వెంకటేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఇటుక తయారీ కేంద్రాల్లో తనిఖీలు

పాలకుర్తి, జనవరి 23 : బడికి వెళ్లాల్సిన బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలుంటామని బాలల పరిరక్షణ అధికారులు ప్రకాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇటుక బట్టీలు, సిమెంట్ ఇటుకలు తయారీ కేంద్రాలను సందర్శించి బాలల పరిరక్షణ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారికి చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఇప్పటి వరకు వర్ధన్నపేట డివిజన్‌లో ఆరుగురు పిల్లలను పనిలో నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. బట్టల దుకాణాలు, హోటళ్లలో, షోరూంలల్లో కూడా తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● కొడకండ్ల : మైనర్లను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని బాలల హక్కుల పరిరక్షణ అధికారి సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని రామన్నగూడెం లక్ష్మక్కపల్లి, రామన్న గూడెం గ్రామాల్లోని ఇటుకబట్టీలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బట్టీల యజమానులను ఆయన హెచ్చరించారు.



ఇటుక బట్టీలలో బాలల వివరాలు తెలుసుకుంటున్న సూర్యప్రకాష్